# రియార్సల్ మా ఇంట్లకచ్చింది

హరిశ్చంద్ర నాటుకం ఆడాలని మా పంతులు చెప్పినప్పటి నుండి నా మనసు లోహితుని పాత్రమీద వడ్డది. ఎట్లయినా ఆ పాత్రను దక్కించుకోవాలనుకున్న. ఈమధ్య ఇద్దరు ముగ్గురు చదువుకున్నోళ్లు రావడం, పాటలు అభ్యాసం కావడంతో నా అవసరం చాలా తగ్గింది. పుస్తకం నాచేతికి అందనిస్తలేరు. నేను కావాలని తీసుకుంటే కసురుకుంటున్నరు. మా కొండయ్య మామ గాలివాటం మనిషి. ఇప్పుడు నేను వచ్చినా రాకున్నా ఒక్కటేనని తెలుసు. ఎప్పుడో ఒకప్పుడు నన్ను రావద్దని బెదిరిచ్చేతట్టున్నడు.

అందుకని నేను రూటుమార్చిన. మా పంతులుకు చాలా దగ్గరైపోయిన. అందరికంటే ముందే రా వడం, చాపలు పరువడం బిందెలల్ల మంచినీళ్లు పెట్టడం ఇంకా చిన్న చిన్న పనులు చేత్తున్న. పంతులు ఏదైనా పని చెపితే క్షణాలమీద చేత్తున్న. జంగమమ్మకు పూలు తెచ్చి ఇత్తున్న. నీళ్లు మోత్తున్న. మా ఇంట్లోంచి కాయనో పండో కూరగాయలో తీసుకపోయి ఇత్తున్న.

మా మాల్లెంలో లోహితుని పాత్రకొరకు నాకు పోటీగా ఇద్దరున్నరు. ఒకడు గడ్డమీది బాల్‌రాజు. వీళ్ల అన్న గడ్డమీది రాములు మా మాల్లెంలో మేటివేశకాడు. అంతకుముందు బాల్‌రాజు రియార్సల్‌కు వచ్చేటోడుగాదు. ఈ మధ్య వస్తున్నడు. వచ్చినోడు వట్టిగనే కూసుంటడా..? ఏశంగావాలంటున్నడు.

ఇంకొకడు ఆకుల తిరుపతి. వాడు నాతోనే చదువు కుంటుండు. వానికి మా మాల్లేనికి ఏ సంబంధం లేదు. కాకపోతే వానికి డ్యాన్స్‌వచ్చు. 'సరిలేరు నీకెవ్వరు'. 'ఇదిగో నేనున్నాను అదిగోనువ్వున్నావు', 'రారా నాసామిరంగ', 'చంగు చంగురే బంగారు రాజా'... ఇసొంటి పాటలమీద డ్యాన్స్ చేస్తడు.

మధ్యమధ్యలో మేకప్ పూర్తిగానప్పుడు ఒక డ్యాన్స్ పాటవేస్తే ఎట్లుంటదని మా జంగం పంతులు బాంబు పేల్చిండు. అప్పుడే ఆకుల తిరుపతి నాకు పోటీగా మారిండు. మా పంతులు ముందే పాటవాడి డ్యాన్స్‌చేసి చూపిండు. అందరూ మెచ్చుకున్నరు. 'వారీ నువ్వు మా నాటుకంల ఉండాలెరా' అన్నరు. మా కొండయమామ గూడా అదేమాట అన్నడు. వాడు తలుకాయ ఊపుతూ రాజుకొడుకు ఏశం కావాలన్నడు. వాడు అడుగంగనే లోహితుని పాత్రను ఇచ్చేసింగ్రు. అట్లా ఆ పాత్ర నాకు కాకుండా పోయింది.

వాళ్లదృష్టిలో నేను మ్యాల్లంల మనిషినేగాదు. 'పోరడు వాళ్ల మామ సోపతికి వస్తండు' అనుకుంటంగ్రు. ఒక్కలకు గూడా పోరనికి మంచి వేశం ఇయ్యాలన్న ద్యాసలేదు. బీడీలకో, అగ్గిపెట్టెకో, మంచినీళ్లకో అయితే నన్ను పిలుస్తరు. ఎవలన్నా వేశకాళ్లు రాకుంటే తీసుకరమ్మని తోలిస్తరు. ఇంతెందుకు? మా మామ గూడా అంతే! ఏ చిన్నపనికైనా నన్నే తోలిస్తడు. పనివినకపోతే మాత్రం 'ఇంటికాడ ఉండి సదువుకోక ఎందుకత్తున్నవు'. మీ బాపుకు చెప్పుత ఉండు' అని బెదిరిత్తడు. ఒక మంచి వేశం ఇయ్యిమంటే మాత్రం ఇయ్యడు.

నాకు ఇష్టమైన వేశం నాకండ్లముందే తిరుపతికి పోయింది. అందరూ పాత్రలు పంచుకున్నరు. నాకు, బాల్‌రాజు గానికి లోహితుని దోస్తులవేశం ఇచ్చింగ్రు. పాటలేదు, పద్యంలేదు. పేరులేదు. లోహితుడు అడవికి ఆకులకు వెళ్తుంటె వెంట మేము వెళ్లాలె. అది పుస్తకంల లేనేలేదు. చేతికింద పోరగాండ్లు ఉంటే చెప్పినపని వింటరని మా ఇద్దరిని తీసుకున్నరు. నేను పంతులుకు మ్యాల్లానికి చేసిన సేవ వట్టిదైపోయింది.

పారట్లు (పాత్రలు) రాయించింగ్రు. ఎవరిపారట్లు వాళ్లు తీసుకున్నరు. నా మాటలు సగం కమ్మగూడా నిండలేదు. రెండుసార్లు చదువంగనే వచ్చినయి.

అది ఎండాకాలం దినం. కోతలు మోతలు అన్నీ అయినయి. పనేంలేదు.

ఆయిటిమూనే లోపు ఆటవెయ్యాలని అందరిప్లాను. ఆయిటి మూనితే పనులమీద వడి ఒకలకొకలు దొరుకరు.

ఈసారి లెక్కలు చూసుకున్నరు. ఇంకా వందరూపాయలు మామకే ఇచ్చేది తేలింద్రు. మాల్లెంలకు ఎప్పుడూ ఒకలిద్దరు కొత్తవాళ్లు వస్తనే ఉన్నరు. పాతవాళ్లు వెళ్లిపోతనే ఉన్నరు. నిలకడలేకుండా ఉంది. మనిషికి ఐదురూపాయలు వేసి మామ బాకి సగం ఇచ్చెయ్యాలని ఇంకో సగం ఆట ఆడితీరాలని, పంతులుకు పైసలివ్వకుండా మనిషికి తవ్వెడు బియ్యం ఇయ్యాలని నిర్ణయించుకున్నరు.

అందరికో ఆలోచనుంటే నా ఆలోచన నాకుంది. నా ప్రయత్నాలు నేను చేత్తనే ఉన్న. పాత్ర మాత్రం నా చేతికి వత్తలేదు. తిరుపతికి ఎప్పుడో వంక తీత్తున్న. నీకు సదువనేరాదని తప్పులు తీత్తున్న. వాని పాటలను అట్లగాదు ఇట్లని సదివి చూపిత్తన్న. అయినా నా వేశం మారలేదు.

రియార్సల్ మొదలయింది. మా రియార్సల్ ఎట్ల నడుత్తందంటే మొదట వారం రోజులు ఎవరిపాత్ర వాళ్లు కూచుండే సదువాలె. వారం తరువాత పారటును చూసుకుంట నిలవడి చదువాలె. మూడవ వారంల నోటికి యాక్షన్ చేస్తూ పాడాలె. నాలుగవ వారంల ప్రాక్టీసు. ఆ తర్వాత ఆట.

మొదటివారంలో ఒకనాడు సగం ఇంకోనాడు సగం చొప్పున ఆటపూర్తి కావడానికి రెండురోజులు పడుతుంది. రెండవ వారం ఏరోజుకు ఆరోజు ఆటను పూర్తి చెయ్యాలె. పంతులుకు ఈ రెండు వారాలే పని. పాటలు ఎట్లా పాడాలో వచనం ఎట్లా చెప్పాలో పద్యాలు ఎట్లా రాగం తియ్యాలో యాక్షన్ ఎట్లా చెయ్యాలో చూపిస్తడు. తర్వాత ఎవరికి వారు నోటికి పాడటమే!

మా రియార్సల్ రెండు వారాలకు వచ్చింది. పనేంలేదు గదా! పొద్దుమాపు యాదిజేసుడేనాయె. అప్పటికే అందరికీ పాటలు నోటికచ్చినయి. నా మనసు కుతకుత ఉడుకుతనే ఉంది. ఆశ ఇంకా చావలేదు. కోపం వచ్చి రెండుమూడురోజులు రియార్సల్ మానేసిన.

నన్ను అడిగినోళ్లులేరు. ఎందుకురావడం లేదని తెలుసుకున్నోళ్లు లేరు. కనీసం కొండయమామ, దాసు చిన్నాయిన గూడా పలుకరియ్యలేదు. పంతులు గూడా వస్తలేదని ఎవ్వలను తోలలేదు. పంతులమ్మ మాత్రం ఇంట్ల కట్టెలు లేకుంటే నన్ను రెండుసార్లు యాదిజేసిందట. ఆ విషయం తిరుపతి గాడే చెప్పిండు.

నాకు కోపం వచ్చింది. మా ఇంట్ల తెల్ల తీటేర్ల పొడివుంది. ఎప్పుడన్నా బైలుసాపు

లేకుంటే మా అమ్మ తినిపిస్తది. పొట్లంగట్టి జేబులో వేసుకుని మూడవనాడు కోపంగా రియార్సల్‌కు పోయిన.

ఎండాకాలం దినంగదా! చుట్టుపక్కల ఇండ్లవాళ్లంతా రియార్సల్ చూడడానికి వత్తురు. ఆటపూర్తయ్యే దాక లెవ్వకపోదురు. మేం తెచ్చిన నీళ్లే తాగుదురు. వేశం లేదుగనీ నీళ్లమోత మనదే గదా. మొదట నేనే ఈ పనిని చెప్పకపోయినా చేసిన. అది నాకు పర్మినెంటు అయిపోయింది. వాకిట్లనే బాయి. బాయిలోంచి బిందెతో నీళ్లు తేవాలె.

నేను పొట్లంలోని పొడిని నీళ్లల్ల కలుపుకుని తాగిన. తాగినంక వెనుక వరుసల కూసున్న. ఆ పొడి సంగతి నాకు బాగా తెలుసు. ఎప్పుడన్న నాలుకకు రాసుకుంటేనే కడుపుల గడగడ మొదలైతది.

అనుకున్నట్టు అరగంట కాంగనే కడుపుల గుడగుడ మొదలైంది. వట్టిగపోతే ఎక్కడికి పోయినవంటరు. ఇప్పుడు కాకపోయినా తెల్లారైనా బయటవడుతది. అందుకని బిందెవట్టుకుని నీళ్లు తెస్తనని బయటకు పోయిన.

బయట అమాసచీకటి. అడుగుముందు ఏముందో కనిపించదు. బిందెను బాయి దగ్గర పెట్టిన. ఎదురుగా ఉన్న కోమట్ల ఇంటికడుప దగ్గరకిపోయి లాగు ఇడిసి కూసున్న. అప్పటికే రాత్రయింది గదా. అందరూ నిదురవోతున్నరు. ఆ కోమట్లకు మా పంతులోళ్లకు అగ్గిపగ. ఎవలకూ అనుమానం రాకుండా అట్ల ఆరాత్రి నాలుగు బిందెల నీళ్లు మోసిన.

తెల్లారి కోమట్లకు పంతులోల్లకు పెద్దపంచాది. బాగోతపు మాల్లెంబెట్టి పంతులు వాకిళ్లు పాడు జేత్తండని పిరాదయింద్రు. పెద్దలొల్లి పుట్టింది. కోమట్లమ్మ జంగమమ్మ కొట్లాట పెట్టుకున్నరు. కోమట్లమ్మ జంగమమ్మను కొట్టింది. తిట్టరాని తిట్లు తిట్టింది. ఈరోజు వాళ్లకయింది. రేపు మాకైతదని వాడకట్టుమొత్తం ఒక్కటయింది.

రియార్సల్ పెట్టనే వద్దని పెడితే మర్యాద దక్కదని చెప్పింద్రు. పంతులమ్మ ఏడ్సుడేగాదు. పొద్దున కత ఎట్ల జరుగుతదోనని నేను బడికిపోక పంతులు ఇంట్లనే ఉన్న. పంతులమ్మ మన ఇంట్ల రియార్సల్ వద్దని పంతులుకు వార్నింగ్ ఇచ్చేసింది.

అంతటితో రియార్సలు ఆగిపోతదనుకున్న. మా కొండయ మామ విడిచిపెడుతడా! “సగం నేర్చి ఎట్లా వదిలేద్దాం. మా అక్కోల్ల ఇంట్ల మస్తు జాగుంది పోదాం” అని మ్యాల్లం మొత్తంను మా ఇంటికి తెచ్చిండు. మాది రెండు సంకలపెద్దిల్లు. వందమంది బంతి కూసోవచ్చు. ఇంటిముందు వెనుకా మస్తు జాగుంది.

ఇకనేను ఊరుకుంటనా నాకు ఏశంగావాలని మా అమ్మతోని చెప్పిన. ‘ఒరేకొండా..వీనికి రాజుకొడుకు ఏశమట ఇయ్యి’ అని చెప్పింది అమ్మ. కొండయ మామకు

నాలిక సందుల ముల్లు ఇరిగినట్టయింది. నన్ను బుదురకియ్యాలని చూసిండు. నేను వినలేదు. ఇంక ఇయ్యక సత్తదా మామ.

అట్లా పారటు నాచేతికి వచ్చింది. ఆకుల తిరుపతి అలిగిపోయిండు. రియార్సల్‌కు రాలేదు. ఇదేం పద్ధతి అని మామను అడిగే దమ్ము ఎవ్వలకు లేదు. రాకపోతే రాకపోనీ అన్నరు అందరు.

నేను వానికంటే పాటలు మంచిగ చదివిన. రెండు వచనాలు ఎక్కువనే చెప్పిన. నేను చేసిన పని ఇంతదూరం తెత్తదని అనుకోలేదు. ఏదో కోపంతో అట్లా చేసినగనీ ఇట్లా జరుగుతుందనుకుంటే ఈ పని ఎప్పుడో చేద్దును.

ఇక జంగం పంతులు ఇంటికి మా ఇంటికి మస్తు దూరం. మ్యాల్లం మాఇంటికి వచ్చినంక 'నాకు చాతగాదు అంతదూరం రాను'. అన్నడు పంతులు. అప్పటికే పాటల తీరు మాకు నోటికి వచ్చింది కాబట్టి కష్టమేమీ కాలేదు. బుక్కు చేతవట్టుకుని అందరికీ నేనే పాటలు అందిచ్చిన. అనుకున్న రోజునే ఆట వేసినం ఈసారి టికెట్టు పెట్టి గడీల ఏద్దామనుకున్నంగానీ మామనే వద్దన్నడు.

గరిశెలగడ్డకువేస్తే ఊరంతా చూస్తరని అక్కడవేసినం. రెండే రెండు పెట్రమాక్సులైట్లు. అందరూ మెచ్చుకున్నరు. చంద్రమతి పాత్ర వేసిన గడ్డమీది రాములు జనాలకు కంటతడిపెట్టిచ్చిండు. కొండయమామ విశ్వామిత్రుని వేషం వేసి స్టేజి మొత్తం గడగడ వణికిచ్చిండు. దాసు చిన్నాయిన హరిశ్చంద్ర మారాజు ఏశమేసి ఒకదమ్ము ఏడిపిచ్చిండు.

మా కోతిమూతి ఎల్లయ్య తెలుసుగదా! ఇందులో నక్షత్రకుని ఏశం. రెండే రెండు మాటలు. "అరిశ్చంద్రా...ఆకలి, దూప...రూపాయలు" అని రాజు వెంటతిరుగాలె. ఈ మాటలు అన్నప్పుడల్లా జనం ఇరుగవడినవ్విండ్రు. ఇంత దాక బాగనే ఉంది.

మా ఎల్లయ్య సంగతి తెలుసుగదా ఎడ్డిమూర్ఖుడని. తన డైలాగులకు జనమంతా నవ్విండ్రని కండ్లు నెత్తికెక్కినయి. తెల్లారో మరునాడో జీతమున్న దొర కోడలు ముందు ఆ రెండు మాటలు మర్చిపోయి 'దూప... దూప...' అన్నడట నవ్వియ్యాలని.

'నీ తలపండు వలుగ ఎవడ్రాదూప' అని కోడలు దొర్సాని పొయిల కొర్రాయితోని కొంకుల మీద పెట్టిందట.